క్లుప్తంగా

పంచముఖ ఆంజనేయస్వామికి ఘనంగా గ్రామోత్సవం



బ్రాహ్మణగూడెంలో స్వామి వారి ఊరేగింపులో భక్తులు

చాగల్లు: బ్రాహ్మణగూడెం మెయిన్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన 28 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామ పురవీధుల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన దాపర్తి సత్యనారాయణ, గోపాల కృష్ణవేణి దంపతులు, దాతల సహకారంతో స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆంజనేయస్వామి విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. సోమవారం జగన్నాథపురం వారితో కోలాట భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 28న విగ్రహ ప్రతిష్ఠ, ప్రధమారాధన, పీఠారోహణ, కళా వాహనం పూజలు, అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



రాజమండ్రిలో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాళ్లపూడి: మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మండల బీజేపీ అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, ఇతర బీజేపీ నాయకులు సోమవారం రాజమండ్రిలో కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసారు. ముఖ్యంగా లారీల్లో ఇసుక తరలించే సమయంలో రోడ్డుపై ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగించాలని, తాళ్లపూడి బస్టాండ్‌లో బస్సులు నిలపడం లేదని, తాళ్లపూడి మెయిన్ రోడ్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్కా వెంకటేశ్వరరావు, ఇమ్మణ్ణి అనసూయ, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన ప్రదర్శన

తాళ్లపూడి(కొవ్వూరు): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ వీర్నాల సత్యకృష్ణ కళాజాతా బృందం ఆధ్వర్యంలో సోమవారనం కొవ్వూరులో పలు చోట్ల వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. ఐసీటీసీ సెంటర్ ఆవశ్యకత ఏఆర్టీ మందుల ప్రాధాన్యతను వివరించారు. హెచ్‌ఐవీ టోల్ ఫ్రీ నంబర్ 1097 వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ ఎన్జీవో ప్రాజెక్టు సిబ్బంది గౌతమి నిర్మల, కొవ్వూరు ఐసీటీసీ కౌన్సిలర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని మంత్రి కందులు దుర్గేష్ ఆదేశించారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆయన అకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పరిష్కార వేదికలో ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎంత మంది అధికారులు ఉన్నారని తహసీల్దార్ డి.అచ్యుత కుమారిని ప్రశ్నించారు. హాజరు పట్టికను పరిశీలించిన ఆయన మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రాని వారికి, సంతకం చేసి బయటకు వెళ్లిన వారికి వెంటనే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అర్జీదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రతి సోమవారం కార్యాలయాలకు ప్రజలు వస్తే పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యంలో మొలకలు.. రైతులకు కష్టాలు

- ఎవరు ఆదుకుంటారని అన్నదాతల ఆవేదన
- ధాన్యం కొనుగోలుకు రైతులు, కౌలుదారులు ఎదురుచూపులు
- వర్షార్పణమైన పంట
- నియోజకవర్గంలో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు



ఖండవల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



ముక్కామలలో మొలక వచ్చిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు వలవల బాలాజీ



ముక్కామలలో మొలకలు వచ్చిన ధాన్యం బస్తాలు

పెరవలి: ధాన్యం కొనుగోలు విషయంలో కూటమి ప్రభుత్వం రైతులను అష్టకష్టాలు పెడుతోంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండిన ధాన్యం రాశుల్లోనే ముగ్గిపోతోంది. దీనికి తోడు అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పండిన ధాన్యం చేతికి అందినా నోటికి దక్కదేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ధాన్యం రాశులు తడిచిసి ముద్దయ్యాయి. దీంతో ధాన్యం మొలకలు రావడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు.

నెరవేరని ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం

పెరవలి మండలంలో అధికారుల లెక్కల ప్రకారం 3,500 మెట్రిక్క్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్దేశించుకున్నా నేటికీ ఆ లక్ష్యం నెరవేరలేదు. రాశుల్లోనే ఉన్న ధాన్యం వర్షాలకు తడిసిపోంది. పెరవలి మండలంలో ముక్కామల, పెరవలి, ఉమ్మిడివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ఖండవల్లి గ్రామాల్లో ధాన్యం రాశుల్లోనే ఉంది. ఈ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేయటానికి ఇంకా అనుమతులు రాకపోవడంతో రైతులు నానా పాట్లు పడుతున్నారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ధాన్యం రాశులను రైతులు బరకాలు కప్పి అలాగే ఉంచారు. ఆదివారం కాస్త ఎండ కాయడంతో రైతులు హడావుడిగా రాశులపై కప్పిన బరకాలను తొలగించి చూసే సరికి బస్తాల్లో ఉన్న ధాన్యం మొలకలు రావడంతో లబోదిబోమంటూ ధాన్యాన్ని తీసి ఆరబెట్టే పనిలో పడ్డారు. మిల్లర్లు ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు తలుపులు మూసివేయడంతో పాటు ప్రభుత్వం కూడా కొనుగోలుకు అనుమతులు ఇవ్వకుండా ప్రకటనలకే పరిమితమై రైతులను మభ్యపెడుతూ కాలయాపన చేస్తోంది. అధికారులు, నాయకులు ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేయడమే తప్ప నిజంగా రైతులకు మేలు చేసేందుకు తగిన చర్యలు లేవని పలువురు విమర్శిస్తున్నారు.

నియోజకవర్గంలో ధాన్యం నిల్వలు

నిడదవోలు నియోజకవర్గంలో ధాన్యం నిల్వలు అధికారుల లెక్కల ప్రకారం 16వేల మెట్రిక్ టన్నులు ఉందని చెబుతున్నా అది ఇంకా ఎక్కువే ఉంటుందని రైతులు అంటున్నారు. నిడదవోలు మండలంలో 8,600, మెట్రిక్ టన్నులు, ఉండ్రాజవరంలో 4,500 మెట్రిక్ టన్నులు, పెరవలి మండలంలో 3,500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులు లెక్కలు చెబుతున్నారు. వాస్తవంగా నియోజకవర్గంలో 20 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం ఉందని, పెరవలి మండలంలోని ముక్కామలలోనే 3 వేల బస్తాల ధాన్యం కళ్లాల్లోనే రాశులుగా ఉందని రైతులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలకు ధాన్యం రాశులు తడిచి ముద్దవ్వడంతో ఎవరూ కొనుగోలు చేయరని, అయినకాడికి అమ్ముకోవలసిన దుస్థితి ఏర్పడిందని రైతులు దీనంగా చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కొనుగోలుకు అనుమతులు రాలేదని చెప్పడంతో ధాన్యాన్ని రాశిపోసి ఉంచాను. ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. వర్షానికి ధాన్యం మొత్తం తడిసిపోయింది. ఇప్పుడు ఏమి చెయ్యాలో తెలియటం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కేతా శ్రీనివాస్, రైతు, ముక్కామల

వర్షాలకు ధాన్యం తడిసింది



మూడు ఎకరాల్లో వరి సాగు చేసాను. 270 బస్తాలు ధాన్యం రాశుల్లో ఉంది, వర్షాలకు తడిచిపోయింది, ధాన్యం కొనే నాధుడు లేడు. ప్రభుత్వం రైతులను ఇలా మోసం చేస్తుందని అనుకోలేదు. ఇప్పుడు మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

– పంపన సత్యనారాయణ, రైతు, ముక్కామల

ఇప్పటికీ అనుమతులు రాలేదు



మా గ్రామంలో 3 వేల సారల ధాన్యం నిల్వలున్నాయి. ధాన్యం కొనుగోలుకు నెల రోజులుగా అనుమతులు వస్తాయంటూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. ఇప్పుడు ధాన్యం తడిసి, మొలకలు వస్తున్నాయి.

– వీరవెంకట కృష్ణారావు, రైతు, ముక్కామల

సేంద్రియ సాగుకు ప్రాధాన్యమివ్వాలి



నల్లజర్లలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నల్లజర్ల: రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, ప్రకృతి సాగుకు ప్రాధాన్యమివ్వాలని రైతులకు కలెక్టర్ ప్రశాంతి సూచించారు. నల్లజర్లలో నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగును సోమవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. దాళ్వా సాగు అనంతరం నవధాన్యాలు, పచ్చిరొట్ట సాగు చేపట్టినట్టు రైతులు కూచిపూడి గంగరాజు, బొమ్మిరెడ్డి గాంధీ తెలిపారు. పెసర, మినుము సాగుకు అవకాశం లేని పొలాల్లో రైతులు జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువును సాగు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయం విధానం అవలంబించేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఐసీఆర్‌పీలు) చర్యలు చేపట్టాలన్నారు.

పచ్చిరొట్టతో భూసారం

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట సాగుతో రైజోబ్యామ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది భూసారం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట మొక్క వేళ్ల నుంచి భూమిలో నత్రజని చేరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి బొర్రా తాతారావు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలోని 47 వేల ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని నిర్ణయించామని, ఇప్పటి వరకు 25 వేల ఎకరాలలో సాగు ప్రారంభించినట్టు చెప్పారు. రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులుగా ఆవు మూత్రంతో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం ప్రకృతిలో లభించే వివిధ రకాల ఆకులతో పంటలకు వ్యాపించే పురుగులు, తెగుళ్లను నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఆర్‌ఐ శాస్త్రి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): డివిజన్‌స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మీకోసం పీజీఆర్‌ఎస్ ద్వారా సోమవారం ఆరు వినతులు వచ్చినట్టు తెలిపారు. డివిజన్ అధికారులు ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ అర్జీలను 1100 – మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీలు

చాగల్లు మండలం దారవరానికి చెందిన గాడి కోటిబాబు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కావాలని కోరారు. చాగల్లుకు చెందిన సయ్యద్ చాంద్ బీ ప్రభుత్వ నుంచి కొనుగోలు చేసిన భూమి కబ్జాకు గురైందని, న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద అప్రమత్తంగా వ్యవహరించాలి



కుమారదేవం వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

తాళ్లపూడి(కొవ్వూరు): ఇసుక స్టాక్ పాయింట్లకు ఇసుక తరలించే సమయంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కొవ్వూరు మండలం అరికిరేవుల, కుమారదేవరం ఇసుక స్టాక్ పాయింట్లను సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్డీవో రాణి సుస్మితతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ స్టాక్ యార్డు, స్టాక్ పాయింట్లు, ఇసుక రీచ్‌ల నుంచి వాహనాల ద్వారా ఇసుక రవాణా చేసే రహదారిపై ఇసుక జారి పడడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరిమితికి మించి ఇసుక రవాణా, వాహనాలపై టార్పాలిన్ సరిగ్గా ఉందో లేదో క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆయా పాయింట్ల నుంచి బయటికి పంపాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఆయా స్టాక్ పాయింట్ నిర్వహణ ఏజెన్సీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తహసీల్దార్ ఎమ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యాలయంలో స్టాక్‌పాయింట్ నిర్వాహకులతో సమావేశం అనంతరం స్థానిక కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత సంబంధిత ఇసుక రీచ్ పాయింట్లు, ఇసుక స్టాక్ పాయింట్ నిర్వాహకులతో, ఇతర సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను అనుసరించి తగిన సూచనలు చేశారు.

50 శాతం సబ్సిడీపై పశువుల దాణా సరఫరా



కానూరులో సబ్సిడీపై పశువుల దాణా అందిస్తున్న పశు సంవర్థక శాఖ అధికారులు, నాయకులు

పెరవలి: ప్రభుత్వం పశు రైతుల కొరకు సబ్సిడీపై అందిస్తున్న దాణాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధశాఖ వైద్యాధికారి చరణ్ తెలిపారు. పెరవలి మండలం కానూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రుకు చెందిన పాడి రైతులకు 500 కిలోల దాణాను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఇప్పటి వరకు 1000 కిలోల దాణా వచ్చిందని ఖండవల్లి పరిధిలోని గ్రామాలకు, కానూరు పరిధిలోని గ్రామాలకు 500 కిలోల చొప్పున అందిస్తున్నామని తెలిపారు. ఈ దాణా పోషకాలతో కూడి ఉంటుందని దీని వలన పాల ఉత్పత్తి పెరగటంతో పాటు, పశువులు ఆరోగ్యవంతంగా ఉంటాయని తెలిపారు. ఈ దాణా విలువ కిలో రూ.1,100 ఉంటుందని, 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు సరఫరా చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానూరు సర్పంచ్ భావన మధు, నడుపల్లి సర్పంచ్ బీరా సత్యవేణి రాజు, వైద్యాధికారులు రమేష్, సంజయ్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఇసుక రవాణాతో పుంత రోడ్డు ఛిద్రం



బల్లిపాడు వద్ద పుంత రోడ్డులో భారీ లారీలతో ఇసుక రవాణా



ఇసుక లారీలతో బురదమయంగా మారిన పుంత రోడ్డు

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడు ఓపెన్ ర్యాంపు ద్వారా ఇసుక రవాణా చేస్తున్న భారీ వాహనాలలు, లారీల రాకపోకల వల్ల పుంత రోడ్డు పాడైపోయి చిత్తడిగా మారి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామానికి చెందిన రైతు వల్లభని చంటి తదితరులు ఆరోపించారు. బల్లిపాడు నుంచి గోదావరి ఏటి గట్టుకు వెళ్లే పుంత రోడ్డులో అనేక మంది రైతులకు చెందిన పంట పొలాలున్నాయని, కనీసం పొలాలకు నడిచి వెళ్లేందుకు సైతం భయంగా ఉందని అన్నారు. భారీ వాహనాల రాకపోకలతో రహదారి మొత్తం బురదమయంగా మారి, గోతులు ఏర్పడి చిత్తడిగా మారిందని రైతులు అన్నారు. మోటార్ సైకిళ్లపై వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు స్పందించి తమ కష్టాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సంప్రదాయ సాగు విస్తీర్ణం పెంచాలి

తాళ్లపూడి (కొవ్వూరు): వర్షాకాలం ముందు వేసవిలో పొలాల్లో పీఎండీఎస్ కిట్లలో అందించే విత్తనాలు నాటడం వల్ల సంప్రదాయ వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు భూసారం పెరుగుతుందని తద్వారా మేలైన పశుగ్రాసం అందుబాటులోకి వస్తుందని దీనిపై రైతులు వ్యవసాయ శాఖాధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం కొవ్వూరు మండలంలో రెవెన్యూ, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తల బృందంతో కలెక్టర్ పర్యటించారు. కాపవరం, ఐ పంగిడిలో కలెక్టర్ పర్యటనలో భాగంగా స్థానిక రైతులతో ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేల సాంద్రతను పెంచేందుకు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు జిల్లా వ్యాప్తంగా 47,600 ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కిట్లు అందజేసినట్టు తెలిపారు. కొవ్వూరు మండలంలోని కాపవరం, ఐ.పంగిడిలో కలెక్టర్ పర్యటించి పలు పంట పొలాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సుమారు 43,338 మంది రైతులకు 47, 600 కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని క్రమబద్ధీకరణ చేసేందుకు ఈ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పంటల సాగుకు ఇది ప్రాథమిక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా ఇటువంటి నూతన ఆవిష్కరణలు, పద్ధతులు పాటించి సస్యరక్షణ చర్యల ద్వారా అధిక పురుగు మందులు వాడకం నివారించడం ద్వారా మానవాళికి కలిగే అనర్థాలను తగ్గించి కలుషితం లేని పంటను పండించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో సుస్థిరతకు ప్రోత్సాహం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకు సాగులో సుస్థిరతను ప్రోత్సహించేందుకు ఐకార్ - నిర్కా, ఆవుల్ టెక్నో మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ తెలిపారు. దీని ద్వారా సంప్రదాయ కలప ఆధారిత ఆరబెట్టే పద్ధతికి ప్రత్యామ్నాయంగా శక్తి పరిరక్షణ, పర్యావరణ అనుకూలత కలిగిన ఎలక్ట్రిక్ పద్ధతుల వైపు మారడానికి ముందడుగు పడనుందన్నారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) మోడల్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఆకులను ఆరబెట్టే ఎలక్ట్రిక్ హీట్ ఎయిర్ పంప్ రూపకల్పన, మౌలిక విశ్లేషణ, ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కలప వినియోగాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. ఇది భారతదేశ పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ఆవుల్ టెక్నో సంస్థ పొగాకు పంటలో తక్కువ వ్యయం, అధిక విలువ కలిగిన పోస్ట్-హార్వెస్ట్ పరిష్కారాలను అందించేందుకు లాట్ ఆధారిత సాంకేతికతను సమన్వయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

వీఆర్‌కు నల్లజర్ల ఎస్సై రమేష్

నల్లజర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై రమేష్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో సోమవారం ఆయన నల్లజర్ల స్టేషన్ నుంచి రిలీవ్ అయ్యారు. ఈ మేరకు సీఐ రాంబాబు మాట్లాడుతూ ఆరు మాసాల క్రితం ఆయన వీఆర్ అనంతరం ఇక్కడికి వచ్చారని తెలిపారు. ఆరు నెలల్లోనే ఎస్సై బదిలీ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మెంటార్‌గా సుసత్య రేఖ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయిని మేకా సుసత్య రేఖ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక జాతీయ మెంటరింగ్ మిషన్ నుంచి ఆహ్వానాన్ని అందుకున్నారు. భారత ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మానస పుత్రిక న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 20 – 20 వికసిత్ భారత్ 2047 అభియాన్‌లో భాగంగా ప్రతిష్టాత్మకమైన జాతీయ మెంటరింగ్ మిషన్ ఏర్పాటు చేసింది. జాతీయస్థాయిలో బోధనా రంగంలో నూతన ఒరవడిని సృష్టించిన, సాంకేతికరంగ నిపుణులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఒక బృందంగా ఏర్పాటు చేశారు. దీనిలో భాగస్వాములు కావాలని మేకా సుసత్య రేఖను ఆహ్వానించారు. జాతీయ ఉపాధ్యాయ మండలి, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో సుసత్య రేఖ జూన్ నుంచి ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని రామన్నపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బుచ్చియపాలెం ఫీడర్‌కు మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఫీడర్లో ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టినందున బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

యోగా సాధనతో ఆరోగ్యం



నిడదవోలు మండలం సమిశ్రగూడెం సచివాలయంలో యోగా సాధన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నిడదవోలు రూరల్: ప్రతి రోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని, యోగ సాధన ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

500 మందికి కంటి వైద్య పరీక్షలు



దుద్దుకూరులో ఏర్పాటు చేసిన శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో షాలోమ్ టెంపుల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆమెన్ ట్రస్ట్, ప్రముఖ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వారి అనుబంధ సంస్థ వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు సంయుక్తంగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 500 మందికి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్టు షాలోమ్ ఇండియా మినిస్ట్రీస్ డైరెక్టర్ కె.గాబ్రియేలు తెలిపారు. అవసరమైన రోగులకు ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా నాగమణి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, పాస్టర్ కె.సద్గుణరావు, ఆమెన్ ట్రస్ట్ ప్రతినిధులు ఇవాంజిల్, అశోక్, చంటిబాబు, డాక్టర్ ఎస్‌కే కరీం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు తనిఖీల్లో దేవరపల్లిలోని సారా విక్రయిస్తున్న బలం ప్రసాద్‌ను అరెస్ట్ చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా సారా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు అవార్డు

కంబాలచెరువు: గోదావరి ఇంజినీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందర్ప వెంకటరామ శ్రీనివాస్‌కు ఢిల్లీలో సౌత్ వెస్టన్ అమెరికా ఈ నెల 24న యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ సైన్సెస్ అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు ఆయన ఆ వివరాలను సోమవారం తెలిపారు. ఏయూ నుంచి డాక్టర్ పీవీ రమణ పర్యవేక్షణలో ఆయన రాసిన 37 పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయంగా ప్రచురితమయ్యాయి. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రెండు పుస్తకాలు రాశారు.